# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!

## కౌలుదారుల కాలమ్‌తో కుప్పకూలనున్న వ్యవసాయం

## ధరణిని తీసేస్తే..

# భూముల గోల్ మాల్

- ప్రస్తుతం సాగవుతున్న పొలాలన్నీ బీడు భూములుగా మారే అవకాశం
- ఆదాయం కోల్పోనున్న గ్రామీణ కుటుంబాలు
- రైతులకు ముంబై, దుబాయ్‌లకు వలసలే దిక్కుకానున్న పరిస్థితులు
- కౌలు రైతులకు రైతుబంధుతో గ్రామాల్లో తలెత్తనున్న వివాదాలు



వికారాబాద్, నవంబర్ 27, (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్‌కు అధికారమిస్తే ధరణి పోర్టల్ రద్దు, కౌలుదారు కాలమ్, కౌలు రైతులకు రైతు బంధు ఇస్తామన్న రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను చూస్తే సాగు పూర్తిగా ఆగం కానున్నదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెసొస్తే తీసుకొస్తామంటున్న కౌలుదారు కాలమ్‌తో వివాదాలు తలెత్తనున్నాయి. కౌలుదారు చట్టంతో అసలు భూ యజమానులు కౌలుకు ఇచ్చే భూములపై యాజమాన్య హక్కులు కోల్పోయే ప్రమాదం ఉంది. యాజమాన్య హక్కులతోపాటు రైతుబంధును కూడా భూయజమానులు కోల్పోవాల్సిన పరిస్థితి రానున్నది. అయితే కౌలు రైతులకు రైతు బంధు ఇస్తామన్న రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై కూడా తీవ్ర దుమారం రేగుతున్నది. కాంగ్రెసొస్తే రైతు బంధును భూయజమాని లేదా కౌలురైతులో ఎవరికో ఒకరికి మాత్రమే ఇస్తామనడం, రైతు బంధు భూయజమానికి ఇస్తే కౌలు రైతుకు రాదు, కౌలు రైతుకు ఇస్తే భూయజమానికి రాదని రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలతో జిల్లా రైతాంగం భగ్గుమంటున్నది. ఇదే జరిగితే గ్రామాల్లో వివాదాలు తలెత్తి భవిష్యత్తులో భూయజమానులు తమ భూమి బీడుగా ఉన్నా సరేగాని కౌలుకు ఇచ్చే పరిస్థితి ఉండదనే అభిప్రాయం రైతుల నుంచి వ్యక్తం అవుతున్నది. ఇప్పటివరకు సాఫీగా సాగిన భూయజమానులు-కౌలు రైతుల మధ్య కాంగ్రెస్ పార్టీ తీవ్ర అలజడిని సృష్టించనున్నది. కౌలు రైతుల జీవనం భవిష్యత్తులో ప్రశ్నార్థకంగా మారనున్నది. మరోవైపు ఒక్కసారి కౌలుదారుకు భూమిని కౌలుకు ఇస్తే తప్పనిసరిగా నిర్ణీత గడువు వరకు కౌలు భూముల నుంచి తొలగించేందుకు వీలుండదు. ఒకవేళ కౌలు రద్దు చేయాలంటే ఏడాది ముందు నోటీసు ఇస్తేనే కౌలును రద్దు చేసే పరిస్థితి ఉంటుంది. అలాగే భూ యజమానులు తమ భూమిని కౌలుకు ఇచ్చేందుకు నిర్ణయం తీసుకుంటే.. తప్పనిసరిగా ఐదేండ్ల పాటు కౌలుకు ఇవ్వాలి. ఐదేండ్లకు కౌలు రద్దు చేసుకోలేకపోతే ఆటోమేటిక్‌గా మరో ఐదేండ్లు కౌలు పొడిగించనున్నట్లు చట్టం ద్వారా తెలుస్తున్నది. దీంతో అసలు భూ యజమానులు కొత్త కష్టాలు మొదలుకానున్నాయి. అంతేకాకుండా కౌలుకు ఇచ్చిన అనంతరం సంబంధిత భూమిపై ఎలాంటి యాజమాన్య హక్కులు భూ యజమానులకు ఉండవని స్పష్టమవుతున్నది. ప్రధానంగా కౌలుకు ఇచ్చిన భూమిని విక్రయించే సమయంలోనూ కౌలుదారుకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాల్సిన పరిస్థితి ఉంటుంది. కౌలుకు ఇచ్చిన భూములను భూయజమాని ఎవరికి పడితే వారికి అమ్ముకోవడానికి వీల్లేదు, అమ్ముకోవాలంటే మొదట కౌలుదారుకు అవకాశమిచ్చి, కౌలుదారు తీసుకోలేని పరిస్థితిలోనే ఇతరులకు విక్రయించాల్సి ఉంటుంది. కౌలుకు ఇచ్చే సమయంలో నోటి మాటపై కాకుండా కాగితం రాసుకోవాల్సి ఉంటుంది. ఇలా కౌలుదారు చట్టంతో అసలు భూయజమానుల కంటే కౌలు దారులకే హక్కులు కల్పించే పరిస్థితితో రైతులు కౌలుదారు చట్టం పూర్తి వ్యతిరేకత చూపుతున్నారు. ఒకవేళ కౌలుదారు చట్టం అమల్లోకి తీసుకొస్తే ప్రస్తుతం సాగులో ఉన్న భూములు కూడా బీడు భూములుగా మారే పరిస్థితి ఉంది.



### కాంగ్రెస్ వద్దు.. బీఆర్ఎస్సే ముద్దు



ధరణితో రైతుల సమస్యలు పూర్తిగా తొలగిపోయాయి. కాంగ్రెస్ పార్టీ మాత్రం తాము అధికారంతోకి వస్తే ధరణిని తీసివేస్తామని ప్రకటిస్తున్నది. ధరణిని తీసివేసి తిరిగి పాత పట్వారీ పద్ధతిని తీసుకురావాలని కాంగ్రెస్ పార్టీ వారు చూస్తున్నారు. దీంతో రైతులకు నష్టం కలుగుతుంది. రైతులకు ఉపయోగపడే బీఆర్ఎస్ పార్టీ పథకాలు బాగున్నాయి. దీని ద్వారానే రైతులు సంవత్సరంలో మూడు పంటలు పండిస్తున్నారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభిస్తున్నది. కాంగ్రెస్ పార్టీ చెబుతున్న విషయాలు రైతులను నిండా ముంచేలా ఉన్నాయి. ఇలాంటి కాంగ్రెస్ పార్టీ మాకు వద్దు. బీఆర్ఎస్ పార్టీనే మాకు ముద్దు.

**- గందె ప్రసన్నకుమార్, కుస్మసముద్రం, కులకచర్ల**

### ధరణిని తీసివేస్తే.. దళారీల రాజ్యమే

భూముల రిజిస్ట్రేషన్లు ధరణి పోర్టల్ ద్వారా వేగంగా జరుగుతున్నాయి. 10 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ జరుగుతున్నది. వెంటనే మ్యూటేషన్ జరిగి వారం రోజుల్లో ఇంటికే పాస్ బుక్ వస్తున్నది. గతంలో రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి అనేక ఇబ్బందులు కలిగేవి. రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. పాస్ బుక్కులు కూడా నెలల తరబడి పెండింగ్‌లో ఉండేవి. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దళారీల ప్రమేయం ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుతం ధరణి పోర్టల్ ద్వారా డబుల్ రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. కేసులు ఉన్న భూములపై రిజిస్ట్రేషన్‌లు కాకపోవడంతో ఎంతో మందికి మేలు జరుగుతున్నది. వ్యవసాయ రంగానికి తెలంగాణ ప్రభుత్వం ఎంతో మేలు చేస్తున్నది. రైతులను మోసం చేయాలని చూస్తున్న కాంగ్రెస్ పార్టీ మాకొద్దు. రైతులకు ఎంతో మేలు చేస్తున్న బీఆర్ఎస్ పార్టీయే మాకు కావాలి.



**- దయాకర్‌రెడ్డి, మైలార్‌దేవరంపల్లి, వికారాబాద్**

### కాంగ్రెస్ వస్తే మా బతుకులు అంధకారమే



ధరణి ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతున్నది. ధరణితో మా భూముల వివరాలు ఆన్‌లైన్‌లో కనిపిస్తాయి. గతంలో ధరణి లేనప్పుడు మా ఊరులోని భూములు ఒకరి పేరుమీది నుంచి మరొకరికి మాకు తెలియకుండానే మారిపోయాయి. ఎవరి పేరు మీద భూమి ఉన్నదో వారే తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి వేలిముద్ర పెడితేనే వేరే వాళ్ల పేరు మీదకు మారుతుంది. ధరణితో మా భూమిని ఆన్‌లైన్‌లో చూసుకునే అవకాశం కల్పించారు. ఇంత మంచి చేస్తున్న సీఎం కేసీఆర్ సారే మాకు మళ్లీ రావాలి. కాంగ్రెస్ వస్తే మా బతుకులు అంధకారమే.

**- చామల నర్సింహారెడ్డి, మోమిన్‌ఖుర్దు, ధారూరు**

### ధరణి పోతే.. మళ్లీ కష్టాలే..



భూములు భద్రంగా ఉండాలంటే ధరణి పోర్టర్ తప్పనిసరిగా ఉండాలి. భూముల రిజిస్ట్రేషన్ల కోసం కేసీఆర్ సర్కారు తెచ్చిన ధరణి పోర్టల్ బాగుంది. దీనిని తీసేస్తే రైతులకు మళ్లీ కష్టాలే. కౌలు చట్టం, రెవెన్యూ రికార్డుల్లో పాతకాలం నాటి పద్ధతులను అమలు చేస్తామని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు. దీనిద్వారా మళ్లీ పట్వారీల పెత్తనం వస్తుంది. ధరణి ద్వారా రైతుల భూములకు రక్షణ ఉండడంతో పాటు త్వరగా రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. ధరణి తీసేస్తే దళారుల హవా పెరుగుతుంది. రైతులు నష్టపోవాల్సిన దుస్థితి ఏర్పడుతుంది.

**- అంజిరెడ్డి, చంద్రయాన్‌పల్లి, మోమిన్‌పేట**

### కాంగ్రెస్ హయాంలో భూముల కిరికిరి



సీఎం కేసీఆర్ తెచ్చిన ధరణి పోర్టల్‌తో రైతులకు ఎంతో మేలు కలుగుతున్నది. ధరణి రావడంతో భూముల వివరాలు ఆన్‌లైన్‌లో కనిపిస్తున్నాయి. ఎక్కడి నుంచైనా చూసుకుంటున్నాం. ధరణి లేనప్పుడు భూముల కిరికిరి ఉండేది. రైతులు కొట్లాడేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. భూములకు రక్షణ ఉంది. భూమిని అమ్మినా సదరు రైతు తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి వేలిముద్ర వేస్తేనే భూమి కొన్నవారి పేరు మీదకు మారుతుంది. ఇంత మంచి ధరణి పోర్టల్‌ను తీసేస్తామని కాంగ్రెస్ నాయకులు చెప్పడం అవివేకం. కాంగ్రెస్ కుట్రలను అడ్డుకుంటాం. బీఆర్ఎస్‌కే మద్దతు ఇస్తాం.

**- శంకర్‌లింగం, కొత్తూరు, బొంరాస్‌పేట**

### లంచాలు ఇవ్వలేక.. దళారులను మేపలేక..



తెలంగాణ ప్రభుత్వం రైతుల భూ సమస్యల పరిష్కారానికి ధరణి పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రతిపక్ష పార్టీలు అధికారంలోకి వస్తే ధరణి పోర్టల్‌ను తీసేస్తే రైతుల భూ సమస్యల పరిస్థితి మళ్లీ పాత పద్ధతికే వస్తుంది. రైతులు అటు లంచాలు ఇవ్వలేక.. దళారులను మేపలేక నానా ఇబ్బందులు పడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తుంది. ధరణితో రైతులకు దళారుల, లంచాల బాధ తప్పి క్షణాల్లో పనులు అవతున్నాయి. రైతులు కార్యాలయాల చుట్టూ భూ సమస్యలపై తిరుగుడు తక్కువ చేసుకొన్నారు. ప్రతిపక్షపార్టీల మోసపు మాటలను ప్రజలు నమ్మి ఆగం కావద్దు.

**- చాకలి ప్రభు, పెద్దేముల్**

### కాంగ్రెస్ దళారీ వ్యవస్థ మాకొద్దు



రైతులకు కష్టం నష్టం రాకుండా సీఎం సారు మమ్ములను చూస్తుంటే కాంగ్రెసోళ్లు నట్టేట్లోకి నెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ధరణితో రైతు బంధు, ఇతర పథకాలు మనకు వస్తాయి. ధరణి తీసివేస్తే రైతులకు దిక్కెవరు. రైతు వ్యతిరేకి కాంగ్రెస్. కాంగ్రెస్ దళారీ వ్యవస్థ మాకొద్దు. రైతుల మీద అంత ప్రేమ ఉంటే 10 సంవత్సరాల ముందు ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వమే కదా, మరి అప్పుడు ఎందుకు చేయలేదు. ఇప్పుడు భూమాత పేరుతో ప్రజలను, రైతులను దగా చేయడానికి మన ముందుకొచ్చింది. దాన్ని ఓటు ద్వారా బొంద పెడదాం.

**- తలారి లక్ష్మప్ప, జక్కెపల్లి, యాలాల**